ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం అక్టోబరు 5, 2024 5

అది కొత్త లైను కాదు.. పెండింగు ప్రాజెక్టు

కోటిపల్లి- నర్సాపురం మార్గం ఎప్పటికి పూర్తవుతుందో చెప్పాలి: ఎంపీ



దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌కు మొక్క అందిస్తున్న ఎంపీ హరీష్‌మాథుర్

ఈనాడు, కాకినాడ: ఎప్పుడో 2002లో మంజూరైన కోటిపల్లి- నరసాపురం రైలు మార్గాన్ని నేటికీ కొత్త రైల్వే లైను కింద ఎందుకు చూపిస్తున్నారు..? ఇది సరికాదు.. దీనిని పెండింగ్ ప్రాజెక్టు కింద చూపించి.. త్వరితగతిన పూర్తిచేయాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ కోరారు. విజయవాడలోని ఈటీసీలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఎంపీలతో జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇందులో ఎంపీ హరీష్ మాట్లాడారు. ప్రాజెక్టు పూర్తిచేయడంలో ఇన్నేళ్లుగా ఎందుకు ఆలస్యం జరిగిందని రైల్వే అధికారులను ప్రశ్నించారు. ఇలాంటి సుదీర్ఘంగా, అపరిష్కృతంగా ఉన్న ప్రాజెక్టుల పూర్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో సంయుక్త కమిటీ ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి అడ్డంకులు అధిగమిస్తే ఫలితం ఉంటుందన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో ఎత్తివేసిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలన్నారు. ద్వారపూడి రైల్వే స్టేషన్‌లో కోణార్క్, జన్మభూమి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని రైల్వే జీఎం, డీఎంలను ఎంపీ కోరారు.

కొదమసింహమై ఉరికి..

శ్యామలాసెంటర్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు రాజమహేంద్రవరం వేదికగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. క్రీడా విన్యాసాలతో అథ్లెట్లు అబ్బురపరిచారు. 26 జిల్లాల నుంచి సుమారు వెయ్యిమంది క్రీడాకారులు ఈ ఆటల సంబరానికి తరలివచ్చారు.



హర్డిల్స్ విభాగంలో క్రీడాకారిణి విన్యాసం

తినగలమా.. ఈ ఆహారం

గోదావరి తీరమంటే ఆహ్లాదకర వాతావరణానికి పేరని.. అనేక రకాల సంప్రదాయ వంటకాలు పలకరిస్తాయని ప్రతీతి. మారుతున్న పోకడలకు అనుగుణంగా ఇబ్బడిముబ్బడిగా రెస్టారెంట్లు, హోటళ్లు, చిరు అంగళ్లు వెలుస్తున్నాయి. అంతవరకు సరే వీటిని కొద్దిరోజులుగా అధికారులు పరిశీలించినపుడు నిర్ఘాంతపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. విషపూరిత రసాయనాలు, నిల్వ మాంసం, కృత్రిమ రంగులు ఇబ్బడిముబ్బడిగా వాడకం బయటపడింది.

–ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, టి.నగర్

రుచిగా ఉండేందుకని..

చారిత్రక నగరం రాజమహేంద్రవరంలో నగరపాలక సంస్థ అధికారులు కొద్ది రోజులుగా ప్రధాన హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, ఇతర కేంద్రాల్లో తనిఖీలు చేస్తున్నారు. బిర్యానీ రుచిగా ఉండేందుకు ప్రమాదకరమైన రసాయనాలు (క్యాన్సర్ కారకాలు) వినియోగిస్తున్నట్లు స్పష్టమైంది. రూ.300కు బిర్యానీ విక్రయించే ప్రధాన హోటళ్లు మొదలుకుని రూ.100కు విక్రయించే వీధివ్యాపారులు సైతం వినియోగిస్తున్నారు. ఎక్కువచోట్ల రెండు మూడు రోజులు నిల్వ ఉన్న మాంసం ఉంది.



అపరిశుభ్ర వాతావరణం మధ్యలో వంటశాల

- ☛ చారిత్రక నగరిలో దుస్థితి
- ☛ తనిఖీల్లో ప్రమాదకర రసాయనాలు, నిల్వ మాంసాల గుర్తింపు

కమిషనర్ కేతన్ గర్గ్ తెలిపిన వివరాల ప్రకారం..



ఓ రెస్టారెంట్‌లో గుర్తించిన నిల్వ మాంసం

● ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే రోడ్డులో ఉన్న పెద్ద హోటళ్లలో కాఫీ బేసిన్లను గత కొన్ని నెలలుగా శుభ్రం చేయలేదు.

● మూడో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి గోదావరి గట్టుకు వెళ్లే మధ్యలో ఉన్న ఓ హోటల్‌లోని పన్నీరులో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నాయి. బిర్యానీలో టేస్టింగ్ సాల్ట్, రంగుల కోసం రసాయనాలు కలుపుతున్నారు. ఒక హోటల్‌లో నెల రోజులుగా ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన చికెన్ లభ్యమైంది.

● జాంపేట, ఆజాద్‌చౌక్ ప్రాంతాల్లోని కొన్ని హోటళ్లలో బిర్యానీతోపాటు పెరుగులో కూడా తెల్లగా ఉండేందుకు రసాయన పొడి కలుపుతున్నారు.

● అల్పాహార కేంద్రాల్లోని వంటశాలల్లో దీర్ఘకాలికంగా శుభ్రత లేదు. నాసిరకం నూనెలు వాడుతున్నారు. టీ దుకాణాల్లో కేవలం పౌండర్లతో వేడినీళ్లు కలిపి ఇన్‌స్టంటుగా ఇచ్చేస్తున్నారు. కాలం చెల్లిన ఇవి క్యాన్సర్ కారకాలు.

● వీఎల్ పురం, ఏవీఏ రోడ్డు, జేఎన్ రోడులో ఉన్న కొన్ని బిర్యానీ పాయింట్లలో రసాయనాలు కలిపిన పరిస్థితి.

● ఎటువంటి ప్యాకేజీ లేకుండా నేరుగా ఓ డ్రమ్ములో టీపొడి వేసి వాడుతున్నవారూ ఉన్నారు. ఎక్కడ తయారైందో? తుది గడువు ఎప్పటి వరకు ఉందో వివరాలు లేవు.



రంగులు వేసి చేసిన ఆహార పదార్థాలు

ఇప్పటి వరకు తనిఖీ చేసిన హోటళ్లు	79
నోటీసులు జారీచేసినవి	78
నమూనాల సేకరణ..	4
వసూలు చేసిన అపరాధ రుసుము..	రూ.1.45 లక్షలు
సీజ్ చేసిన హోటళ్లు	2
తనిఖీలకు నియమించిన బృందాలు	6

నగరంలో ఇలా..

జనాభా సుమారు	5 లక్షలు
రిజిస్టర్డ్ హోటళ్లు	267
అనధికారికంగా నిర్వహణ	135

ఏ దుకాణమైనా ఆహార పదార్థాల తయారీలో ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు ఉన్న సరకులే వినియోగించాలి. వంటశాల పరిశుభ్రంగా ఉంచాలి. స్టాంపింగ్(అధికారిక ముద్ర) ఉన్న చికెన్ మాత్రమే వాడాలి. 22 ఆహార శాలల్లో సేకరించిన నమూనాలను కాకినాడలోని జేఎన్‌టీయూ ల్యాబ్‌కు పంపించారు.

అరెస్టులకూ వెనుకాడం..

తొలుత పెద్ద హోటళ్ల నుంచి కింది స్థాయి వరకు ప్రణాళికాబద్ధంగా తనిఖీలు చేస్తున్నాం. ప్రధానంగా బిర్యానీలో ప్రమాదకర రసాయనాలు వినియోగిస్తున్నట్లు గుర్తించాం. చిరువ్యాపారులకు వీటిపై అవగాహన లేక వాడుతుంటే, పెద్ద హోటళ్లలోనూ అదే స్థాయిలో వినియోగం ఉంది. 22 చోట్ల సేకరించిన నమూనాలు ప్రయోగశాలకు పంపించాం. నివేదికలు వచ్చిన వెంటనే ఆయా హోటళ్లను సీజ్ చేసి నిర్వాహకులను అరెస్టు చేసేందుకూ వెనుకాడం.

-కేతన్‌గర్గ్, కమిషనర్, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం



కన్నేశారు.. కొట్టేశారు

- ☛ ఫ్రీహోల్డ్ భూములకు రెక్కలు
- ☛ నిగ్గుతేల్చే పనిలో ప్రభుత్వం

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్: నిబంధనలతో పనిలేదు..అంతా మన సామ్రాజ్యమే అన్నట్లుగా వైకాపా ప్రభుత్వ హయాంలో అక్రమార్కులు రెచ్చిపోయారు. ప్రభుత్వ స్థలాలను చేజిక్కించుకున్నారు. 20 ఏళ్లు గడిచిన అసైన్డ్ భూములపై హక్కులు కల్పించనున్నట్లు నాడు ప్రకటించడమే తరువాయి అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్లు జరిగాయి. పేదల జీవనోపాధికి గతంలో పంపిణీ చేసిన ఇవి ఎవరి అధీనంలో ఉన్నాయి? అమ్మకాలు జరిగితే ఎవరు కొనుగోలు చేశారనే కోణంలో తాజాగా ఆరా తీస్తున్నారు. అన్నింటికీ మించి ఫ్రీహోల్డ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన భూములనూ(ఆర్అండ్‌బి, పోరంబోకు స్థలాలు, దేవాదాయ భూములు) కొందరు కొట్టేశారు.

జిల్లాలో ఇలా.. కోనసీమ జిల్లాలోని 22 మండలాల పరిధిలో 17 వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిలో 232 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ వైకాపా ప్రభుత్వంలో అప్పటి కలెక్టర్ ఫ్రీహోల్డ్ చేశారు. రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా 30 ఎకరాలకు ఇతరుల పేరున అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ లావాదేవీలపై అధికారులు గత మూడు రోజులుగా పరిశీలన చేస్తున్నారు. ఆ భూములు ఎప్పుడు..ఎవరి పేరున ఇచ్చారు? ప్రస్తుతం రిజిస్ట్రేషన్ ఎవరి పేరున ఉందో వివరాలు సేకరిస్తున్నారు. మండల స్థాయి కార్యాలయాల్లో ఉన్న వివరాలను కలెక్టరేట్‌లో ఉన్న దస్త్రాలతో పోల్చి చూస్తారు. వీటిలో మార్పులు ఉంటే వివరణ కోరే అవకాశం ఉంది. జేసీ నిశాంతి మాట్లాడుతూ ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై పరిశీలనకు మూడు రెవెన్యూ డివిజన్లకు ప్రత్యేక బృందాలను నియమించామన్నారు



అల్లవరం మండలం నక్కారామేశ్వరంలోని ప్రభుత్వ భూమిలో అనధికారిక ఆక్వాసాగు

ఇదీ లెక్క

నిషేధిత జాబితాలో ఉన్న భూములు	17 వేల ఎకరాలు
ఫ్రీహోల్డ్ చేసిన భూములు:	276.65 ఎకరాలు
రిజిస్ట్రేషన్ అయినవి	29.13 ఎకరాలు

ఎక్కువగా మండపేటలోనే

ఫ్రీహోల్డ్ చేసిన భూములకు ఎక్కువగా మండపేట మండలంలోనే రెక్కలొచ్చాయి. ఇక్కడి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో దాదాపు 28.27 ఎకరాలు పలువురి పేరున రిజిస్ట్రేషన్ అయింది. ఇవి కాక అల్లవరం మండలంలో 81 సెంట్లు, మలికిపురంలో 6 సెంట్లను అక్రమార్కులు తమ పేరున మార్చుకున్నారు.

అదిగో కార్తికం.. సిద్ధమేనా అన్నవరం

గత లోపాలు పునరావృతం కాకుండా కార్యాచరణ అవసరం

అన్నవరం, న్యూస్‌టుడే: కొద్దిరోజుల్లో పవిత్ర కార్తికమాసం ఆరంభం కానుంది. అన్నవరం సత్యదేవుని ఆలయంలో కీలక వేడుకలు ఈ మాసంలో జరగనున్నాయి. నవంబరు 15న గిరిప్రదక్షిణ, 13న తెప్పోత్సవం ఉంటాయి. మరోవైపు ఈ నెల 27 నుంచి సత్యదీక్షలు ప్రారంభమవుతాయి. గతంలో వేలాది భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న దృష్ట్యా తగిన ఏర్పాట్లుచేయాలని.. సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నేడు సమీక్షా సమావేశం జరగనున్న దృష్ట్యా ఇప్పటినుంచే తగిన కార్యాచరణకు అడుగులు వేయాల్సి ఉంది.

ఇప్పుడు ఏం చేయాలి...

● రూ.200 శీఘ్రదర్శనం, ఉచిత దర్శనాలు, రూ.2 వేలు, రూ. 1,500 వ్రతాలకు ప్రత్యేక లైన్లు ఉండాలి. ● సుమారు 1.50 లక్షల వ్రతాలు జరుగుతాయని అంచనా. ఇందులో 70శాతం రూ.300 వ్రతాలే. అదనపు మండపాలు వేగంగా సిద్ధం చేయాలి. అన్ని ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యాలు కల్పించాలి.

● వివాహ ముహూర్తాలు లేని సమయంలో సత్యగిరిపై ఉన్న విష్ణుసదన్ (వివాహ మండపాలు)ను, రత్నగిరిపై సీతారామసత్రం హాళ్లు డార్మెటరీగా వినియోగించాలి. గదులు ఖాళీ అయిన వెంటనే శుభ్రం చేసి మరొకరికి కేటాయించేలా ప్రణాళిక చేయాలి. ● పలుచోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపుగదులు అవసరం. భక్తులకు అదనపు బస్సులు ఉండాలి. ● దేవస్థానం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద స్నానపుగదులు, మరుగుదొడ్లు తాత్కాలికంగా ఏర్పాటు చేస్తే రైలు మార్గంలో వచ్చేవారికి సౌకర్యం.● పర్వదినాల్లో భక్తులకు పులిహోర, దద్దోజనం పంపిణీ చేస్తారు. భోజన సౌకర్యం కల్పించడంపై కూడా దృష్టిసారించాలి.

తోపులాటలు.. తాగునీటి ఇక్కట్లు

వైకాపా ప్రభుత్వ హయాంలో 2022 కార్తికంలో ఇక్కడి ఉత్సవాలకు ఏర్పాట్లలో అధికారులు విఫలమయ్యారు. క్యూలైన్లు సరిగా లేక తోపులాట చోటుచేసుకుంది. కొందరు చిన్నారులు, వృద్ధులు అస్వస్థతకు గురయ్యారు. భద్రతా లోపం కనిపించింది. వ్రతమండపాలు సరిపోలేదు. గత ఏడాది గిరిప్రదక్షిణకు 1.50 లక్షల మంది హాజరైతే తాగునీరు లేదు. ఆహారం 20 శాతం మందికే సరిపోయింది.

కచ్చితత్వంతో ఓటరు జాబితా రూపొందించాలి

అమలాపురం కలెక్టరేట్, రాజోలు, న్యూస్‌టుడే: కచ్చితత్వంతో కూడిన ఓటరు జాబితాను తయారు చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఓటరు జాబితా సంక్షిప్త సవరణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదుపై కూడా సమీక్ష చేశారు. ఈ నెల 29 నాటికి ముసాయిదా విడుదల చేయాలని, నవంబరు 28 వరకు అభ్యంతరాలు, సూచనలు స్వీకరించాలన్నారు. ఓటరు నమోదుకు నవంబరు 9, 10, 23, 24 తేదీలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలన్నారు. డిసెంబరు 24న అభ్యంతరాలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. జనవరి 6న తుది జాబితా ప్రచురిస్తామన్నారు. జేసీ నిశాంతి, డీఆర్వో వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ● శివకోటి లాకులకు ఇబ్బంది లేకుండా జాతీయ రహదారి నిర్మించేలా ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. శివకోటి లాకుల వద్ద జరుగుతున్న హైవే పనులపై అభ్యంతరం రావడంతో పరిశీలించారు. ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్పీ కృష్ణారావుకు ఏబీసీడీ అవార్డు



డీజీపీ తిరుమలరావుతో ఎస్పీ, అధికారులు

అమలాపురం పట్టణం: ప్రతిష్ఠాత్మకమైన ఏబీసీడీ అవార్డు జిల్లా పోలీసులను వరించింది. శుక్రవారం అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా ఎస్పీ బి.కృష్ణారావు అందుకున్నారు. ప్రముఖ కేసులను త్వరితగతిన దర్యాప్తు చేసినందుకు గాను ఈ గౌరవం దక్కింది. రామచంద్రపురం సబ్ డివిజన్ పామర్రు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుకు 'అవార్డ్ ఫర్ బెస్ట్ కేసు'గా పరిశోధనకు ఎంపిక చేశారు. ఈ మేరకు రామచంద్రపురం డీఎస్పీ బి. రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ దొరబాబు, పామర్రు ఎస్ఐ జానీబాష, డాగ్ హన్టర్ నాగరాజు, స్రైడర్లకు అవార్డు, క్యాష్ రివార్డు అందజేశారు.

ఉపాధిహామీలో 78 రకాల పనులు

గుర్తింపునకు గ్రామసభల నిర్వహణ

– న్యూస్‌టుడే, ముమ్మిడివరం

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారం.. నిబంధనలకు విరుద్ధంగా పనుల కల్పన.. నిధుల మళ్లింపు వంటి వాటితో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా వచ్చే నిధులు సక్రమంగా వినియోగించుకోని పరిస్థితి ఏర్పడిన తెలిసిందే. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కటిగా గాడిన పడుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కూలీలకు పనుల గుర్తింపునకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ పథకంలో రూ.250 కోట్లు ఖర్చు చేయనున్నారు. పనుల గుర్తింపునకు డ్వామాకు చెందిన సాంకేతిక, క్షేత్ర, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు, సర్వేయర్, వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ సహాయకులు, డ్వాక్రా సంఘాల మహిళలు, వాలంటీర్లను బృందాలుగా ఏర్పాటు చేశారు. వ్యవసాయ అనుబంధ పనులతో పాటు సుస్థిర ఆస్తుల కల్పన, వనరుల అభివృద్ధికి సంబంధించి 78 రకాల పనుల గుర్తింపునకు ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చి.. గుర్తించాలని అధికారులు ఆదేశాలిచ్చారు. దీనికి సంబంధించి 385 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పనుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభమైంది. నవంబరు 15 నాటికి తీర్మానాలు తీసుకోవడంలో తలమునకలయ్యారు.



గతంలో నిధుల వినియోగంలో వెనుకబాటు..

ఉపాధిహామీ పథకంలో నిధులు 60 శాతం కూలీలకు వేతనాలుగా ఖర్చుచేస్తే.. 40 శాతం మెటీరియల్ కాంపొనెంట్‌గా మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేసుకునే అవకాశం ఉంది. గత వైకాపా ప్రభుత్వం మెటీరియల్ కాంపొనెంట్ నిధుల వినియోగంలో వెనకబడిపోయింది. కేవలం 29 శాతం మాత్రమే మెటీరియల్ కాంపొనెంట్ నిధులు వినియోగించుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మెటీరియల్ కాంపొనెంట్ నిధులను రహదార్లు, డ్రెయిన్లు, గోకులాలు వంటి నిర్మాణాలకు ఖర్చు చేయనుంది. రూ.150 కోట్లు ఖర్చు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు.

క్షేత్రస్థాయిలో బృందాల ఏర్పాటు

వార్షిక ప్రణాళిక రూపకల్పనకు చర్యలు చేపట్టాం. గ్రామాల వారీగా పనుల గుర్తింపునకు క్షేత్రస్థాయిలో బృందాలను ఏర్పాటు చేశాం. గ్రామసభల ద్వారా పనులను గుర్తించి తీర్మానాలు తీసుకున్న తర్వాత మండల పరిషత్తు ఆమోదంతో జిల్లాకు పంపించేలా సూచించాం. ఉపాధిహామీ పథకంలో ఇప్పటికే జిల్లాలో కూలీలకు 45.79 లక్షల పనిదినాలు కల్పించాం.

- ఎస్.మధుసూదన్, పీడీ, జిల్లా నీటియాజమాన్య సంస్థ

జిల్లాలో వివరాలు ఇలా..

మండలాలు:	22
క్లస్టర్లు:	03 (అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం)
పంచాయతీలు:	385
జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలు:	2.27 లక్షలు (కూలీలు: 3.48 లక్షలు)
యాక్టివ్ జాబ్‌కార్డులు:	1.52 లక్షలు (కూలీలు: 2.25 లక్షలు)
ఇప్పటివరకు కల్పించిన పని దినాలు:	45.79 లక్షలు
వంద రోజుల పనిదినాలు కల్పించిన కుటుంబాలు:	3,083
సరాసరి వేతనం:	రూ.291.46

7 నుంచి తపాలా వారోత్సవాలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం డివిజన్ వ్యాప్తంగా ఉన్న తపాలా కార్యాలయాల్లో ఈ నెల 7 నుంచి 11 వరకు తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని అమలాపురం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఆర్. నవీన్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సహాయ సూపరింటెండెంట్ కె.శ్రీధరంతో కలిసి వివరాలు వెల్లడించారు. వారోత్సవాల సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతను కాపాడాలి



రావులపాలెం పట్టణం: తిరుమల పవిత్రతను కాపాడాలని కోరుతూ భాజపా గుంటూరు జిల్లా ఇన్‌ఛార్జి తమనంపూడి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, హిందూ సంఘాల సభ్యులు శుక్రవారం రావులపాలెంలో ప్రదర్శన నిర్వహించారు. తొలుత స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, సుబ్బరాజు, స్వామి, ఎం.కృష్ణ, జి.వెంకటేశ్వరరావు, కె.చిన్నారి, తదితరులు పాల్గొన్నారు.

గుంతల దారులకు మోక్షం

రూ.17 కోట్ల నిధుల కేటాయింపు

న్యూస్‌టుడే, పి.గన్నవరం

గత వైకాపా ప్రభుత్వం ప్రధాన రహదారులను కనీసం పట్టించుకోలేదు. పోనీ గుంతలైనా పూడ్చేందుకు చొరవ తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గుంతలు పూడ్చేందుకు, మరమ్మతులు చేసేందుకు చర్యలకు ఉపక్రమించింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రూ.17 కోట్లతో వివిధ రహదారుల్లో గుంతలు పూడ్చేందుకు ఈ నెల ఒకటి నుంచి టెండర్లు స్వీకరిస్తున్నామని ర.భ.శాఖ డీఈఈ జి.రాజేంద్ర తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం పనులు మొదలు పెడతామని వివరించారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో మేజర్ డిస్ట్రిక్ట్ రహదారులు సుమారు 220 కిలోమీటర్ల మేర గుంతలు పూడ్చుతారు. బాగా దెబ్బతిన్న వాటికి ఒకపార తారువేసి మరమ్మతులు చేపడతారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ నుంచి వీటికి నిధుల కేటాయింపు జరిగింది. సుమారు 30 రహదారుల్లో మొత్తం 57 పనులుగా విభజించారు. వీటిలో తక్షణ మరమ్మతులు 35, ప్యాచ్‌వర్క్‌లు 22 వెరసి 57 పనులుగా విభజించి టెండర్లు పిలిచారు.



అభివృద్ధికి నోచుకోని పోతవరం గణేష్‌నగర్-కె.ఏనుగుపల్లి బాలాజీ ఫెర్రీరోడ్డు


ఎక్కడి నుంచి ఎక్కడి వరకు..

● పి.గన్నవరం మండలం పోతవరం గణేష్‌నగర్ నుంచి కె.ఏనుగుపల్లి బాలాజీ ఫెర్రీరోడ్డు వరకు సుమారు 4.50 కిలోమీటర్ల మేర పూర్తిగా దెబ్బతిన్న రహదారికి ఒకపార తారుతో మరమ్మతు పనులు చేస్తారు. దీనికి రూ.1.70 కోట్ల నిధులు కేటాయించారు. ● ముమ్మిడివరం నుంచి ముక్తేశ్వరం ఆరు కిలోమీటర్ల మేర రహదారికి రూ.30 లక్షలు ● డి.రావులపాలెం నుంచి గుండేపూడి వరకు రెండు కిలోమీటర్లు.. రూ.40 లక్షలు. ● శివకోడు నుంచి విశ్వేశ్వరాయపురం నాలుగు కిలోమీటర్లు.. రూ.60 లక్షలు. ● మామిడికుదురు నుంచి మగటపల్లి 4.50 కిలోమీటర్లు.. రూ.40 లక్షలు. ● గోపాలపురం నుంచి గంటి వరకు 4.50 కిలోమీటర్లు.. రూ.35 లక్షలు ● ర్యాలి నుంచి అంకంపాలెం వరకు 6.50 కిలోమీటర్లు.. రూ.35 లక్షలు ● పలివెల నుంచి పల్లిపాలెం 5 కిలోమీటర్లు.. రూ.35 లక్షలు ● కూళ్ల నుంచి పామర్రు 4 కిలోమీటర్లు.. రూ.30 లక్షలు ● కె.గంగవరం నుంచి అంగర 15 కిలోమీటర్లు.. రూ.40 లక్షలు

దయ.. సహనం.. రాజసం

అమ్మను కొలిచే భాగ్యం అమోఘం. పసుపుకుంకుమల సౌభాగ్యం. దయ, సహనం, రాజసం ఉట్టిపడే అలంకారప్రియం. దేవీ పాహిమాం అంటూ.. అంతటా శక్తి స్వరూపిణిని వేడుతున్న భక్త జనం. దేవీ శరన్నవరాత్రుల్లో రెండో రోజు శుక్రవారం ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచాయి. భవానీ మాలధారులతో అన్నిచోట్లా చల్లని తల్లి సన్నిధి.. భక్తజన పెన్నిధిగా మారింది. అమ్మవారిని వివిధ రూపాల్లో కొలువుదీర్చి దర్శనం కల్పించారు. అన్నింటా విజయం కోరుతూ దశమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి.

- న్యూస్‌టుడే బృందం


గాయత్రీదేవి రూపంలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు


కాకినాడలో బాలాత్రిపుర సుందరి



తుని గ్రామీణం: గాయత్రీదేవిగా లోవ తలుపులమ్మ దర్శనం


బాలా త్రిపురసుందరీదేవిగా అమలాపురం శ్రీదేవి అమ్మవారు


రాజమహేంద్రవరం: అక్షింతలతో కన్యకా పరమేశ్వరి అలంకరణ

అన్నదాత... ముగ్గురికి ప్రాణదాత

● గ్రీన్ ఛానల్‌లో విశాఖకు అవయవాల తరలింపు


కల్యాణ్‌చక్రవర్తి (పాత చిత్రం)

మసీదు సెంటర్ (కాకినాడ), మండపేట గ్రామీణం: ఆ రైతు తాను ఉన్నంత కాలం సాగు చేస్తూ పదిమంది కడుపు నింపారు. తాను లేకపోయినా మరో ముగ్గురికి ప్రాణదానం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాడు. వివరాల్లోకి వెళ్తే.. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన రైతు రెడ్డి కల్యాణ్‌చక్రవర్తి(51) రాజానగరం పరిధిలో ఈ నెల 2న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కాకినాడ అపోలో ఆసుపత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. వారి సూచనలతో అతని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు అవయవాల దానానికి అంగీకరించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం శస్త్రచికిత్స చేసి రెండు మూత్రపిండాలు, కాలేయం వేరు చేశారు. ఓ మూత్రపిండాన్ని విశాఖపట్నం అపోలో ఆసుపత్రికి, కాలేయాన్ని విశాఖలోని పినాకిల్ ఆసుపత్రికి వేర్వేరు వాహనాల్లో తరలించారు. రెండో మూత్రపిండాన్ని కాకినాడ అపోలోని మరో రోగికి అమర్చనున్నారు. అవయవాలను జీవన్‌దాన్‌లో భాగంగా విశాఖకు తరలించేందుకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో పోలీసులు గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేశారు.

కనికరించే దేవత కనకదుర్గమ్మ


అమ్మవారికి హారతి ఇస్తున్న స్వామీజీ

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: అమ్మ అంటే.. కరుణించే దేవత కనకదుర్గమ్మగా కాకినాడ గ్రామీణం రమణయ్యపేటలోని శ్రీపీఠంలో ఆశ్చర్యంగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీమహాశక్తి క్రియాగం-2024, శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు అరుణవర్ణ ఏకరూప వస్త్రధారణలో సామూహిక కుంకుమ పూజలకు తరలివచ్చారు. పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో లక్ష పసుపు కొమ్ములతో అర్చన జరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వేదపండితులు సహస్రచండీ పారాయణం, శతచండీ హోమం తదితరాలు నిర్వహించారు. రెండో రోజు 32 వేల మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. భక్తి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాకినాడ డీఎస్పీ రఘువీర్‌విష్ణు పర్యవేక్షణలో సీఐలు పెద్దిరాజు, చైతన్యకృష్ణ, రామారావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. శనివారం శ్రీపీఠంలోని గోశాల ప్రాంగణానికి అయోధ్య రామాలయంలో ప్రతిష్ఠించనున్న రజత విల్లు, బంగారం అంబులను భక్తుల దర్శనంకోసం ఉంచనున్నారు.

రంగరాయకు 66 వసంతాలు

వైద్య కళాశాలలో నేడు వేడుకలు



మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ రంగరాయ.. ఇదో సాధారణ పేరు కాదు.. ఒక బ్రాండ్. రాష్ట్రంలో ప్రముఖమైన వైద్య కళాశాలల్లో ఒకటి. 1958లో మొదలై వేల మంది వైద్యులను తయారుచేసింది. అందులో దేశ, విదేశాల్లో పేరొందిన వైద్యులు కూడా ఉన్నారు. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి అనుబంధంగా ఈ కళాశాల పనిచేస్తుంది. ఏటా అక్టోబర్ 5న కళాశాల వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. శనివారం జరిగే వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆటపాటలు, విద్యార్థుల ఆటపాటలకు.. ఇలా 66 ఏళ్ల జ్ఞాపకాలకు ఆర్ఎంసీ కళాశాల ఆడిటోరియం వేదికైంది.

ఈ రోజు కార్యక్రమాలు..

కార్యక్రమాల్లో భాగంగా కళాశాల వార్షిక నివేదిక ప్రవేశపెట్టనున్నారు. గతంలో కన్నా పెరిగిన వసతులు, నిర్మాణాలు, ఏర్పాట్లు తదితర అంశాలతో కళాశాల ప్రగతి గురించి వివరిస్తారు. వివిధ పోటీలు, సదస్సుల్లో పాల్గొని పతకాలు సాధించిన వారు, అకడమిక్స్‌లో బంగారు పతకాలు పొందిన వారి గురించి ప్రస్తావిస్తారు. పలు పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ కింద బంగారు పతకాలు ఇవ్వనున్నారు. అన్ని రంగాల్లో మొత్తం 39 మంది వైద్య విద్యార్థులకు బంగారు పతకాలు, పురస్కారాలు అందించనున్నారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలతో ముగింపు పలుకుతారు.

పేరు తీసుకురావాలి..



ఆర్ఎంసీలో నిపుణులైన వైద్యులు, అధ్యాపకులు ఉన్నారు. పూర్వ విద్యార్థుల సహకారం, చొరవతో కళాశాల మరిన్ని సదుపాయాలు సమకూరుస్తున్నారు. వైద్య వృత్తిలో వస్తున్న ఆధునిక మార్పులను గమనించాలి. కళాశాలకు, తల్లిదండ్రులకు విద్యార్థులు పేరు తీసుకురావాలి.

- డా.డీఎస్‌వీఎల్ నరసింహం, డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపల్

అన్ని ఏర్పాట్లు చేశాం..



కళాశాల వార్షిక దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎంబీబీఎస్ విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు అందిస్తాం. మెమోరియల్ బహుమతుల పంపిణీ జరుగుతుంది. ఇందులో భాగమవ్వడం ఆనందంగా ఉంది.

- డా.ఎ.విష్ణువర్ధన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటంలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న మహాసేన రాజేష్

ముమ్మిడివరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో మాలలంతా భాగస్వాములు కావాలని మహాసేన రాజేష్ పిలుపునిచ్చారు. ముమ్మిడివరం అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో గొల్లపల్లి గోపి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 12న కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించే సభకు అంతా కలిసిరావాలని కోరారు. మంద కృష్ణమాదిగ ప్రధాని నరేంద్ర మోదీ ద్వారా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చేశారని, ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ సందర్భంగా కాకినాడలో నిర్వహించే సభకు సంబంధించిన గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెండి కమల, కాశి సత్యనారాయణమూర్తి, కాశి లాజర్ తదితరులు పాల్గొన్నారు.

సినీ నిర్మాత కన్నుమూత


నళినీరంజన్‌రావు

ద్రాక్షారామ: అందాల తార శ్రీదేవి కథానాయికగా నటించిన తొలిచిత్రం పదహారేళ్ల వయసు నిర్మాతల్లో ఒకరైన ద్రాక్షారామ వాసి దామిశెట్టి నళినీరంజన్‌రావు(85) శుక్రవారం కన్నుమూశారు. ఈయన 1978లో పదహారేళ్ల వయసు, 1983లో చిరంజీవి, రాధిక కలిసి నటించిన పల్లెటూరి మొనగాడు సినిమాలకు ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. ద్రాక్షారామ నీటి సంఘం అధ్యక్షుడిగా చాలా కాలం పనిచేశారు. శుక్రవారం ఉదయం తోటపేటలో గల స్వగృహంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఈయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్


పరుగులో పోటీ పడుతున్న యువతులు

శ్యామలా సెంటర్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి క్రీడాకారులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పర్యాటక శాఖామాత్యులు కందుల దుర్గేష్ మాట్లాడుతూ జిల్లాలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు, శాయ్ క్రీడా శిబిరాలను తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ నగరంలో క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తొలుత వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు ముఖ్య అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా తొలిరోజు రన్నింగ్, త్రోయింగ్, జంపింగ్ విభాగాల్లో హీట్స్ జరిగాయి. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్కే రామచంద్ర, జిల్లా ముఖ్య క్రీడా శిక్షకుడు డి.శేషగిరి, రాజమహేంద్రవరం అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారుడి హైజంప్

వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి శూన్యం

కాజులూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని మంజేరు, శీల, శలపాక, తనుకువాడ తదితర గ్రామాల్లో 'మన ఊరు- మన సుభాష్' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో ఉన్న సమస్యలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంజేరులో మంత్రి మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో దోచుకుతినడానికి పెద్దపీట వేసి రాష్ట్రాభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. నిధులు ఉన్నప్పటికీ గ్రామాలు అభివృద్ధి చెందకపోవడం సిగ్గుచేటన్నారు. సంక్షేమం పేరుచెప్పి రూ.కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్క పథకం అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, చుండ్రు వీర్రాజు చౌదిరి, గండి మణికంఠ, కోమలి వెంకటరమణ, పోతు గనిరాజు, పలుశాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

మరణంలోనూ వీడని మాతృప్రేమ

కుమారుడి మృతితో తల్లడిల్లి ఆగిన గుండె


ఆదిబాబు


మహాలక్ష్మి

(పాత చిత్రాలు)

అంబాజీపేట, న్యూస్‌టుడే: నవమాసాలు మోసిన ఆ తల్లి కుమారుడి మరణవార్తను తట్టుకోలేకపోయారు. అనారోగ్యంతో బిడ్డ మరణిస్తే అది విని ఒక్కసారిగా ఆ మాతృమూర్తి కుప్పకూలిపోయారు. గంటల వ్యవధిలోనే తల్లీకొడుకులు మృతి చెందడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటన అంబాజీపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. అంబాజీపేటలోని మద్దింశెట్టి ఆదిబాబు(46) పూర్వపు చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు, క్రికెట్ టోర్నమెంట్‌ల నిర్వాహకుడు, అమలాపురం ఏ-1 కన్వెన్షన్ ఫంక్షన్ హాలు మేనేజరుగా పని చేస్తున్నారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గురువారం విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. కుమారుడి మరణవార్తను తట్టుకోలేని తల్లి మహాలక్ష్మి(72) గుండెపోటుకు గురై మరణించారు. గంటల వ్యవధిలోనే తల్లీకుమారులు మృతి చెందడంతో అంబాజీపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. పక్కపక్కనే అంత్యక్రియలు నిర్వహించడంతో రుద్రభూమికి వెళ్లిన పలువురు చలించిపోయారు. మహాలక్ష్మికి నలుగురు కుమారులు. ఒక కుమారుడు కనిపించకుండా వెళ్లిపోగా.. ఇద్దరు కుమారులు ఆమె కళ్ల ముందే గతంలో కన్నుమూశారు. చిన్నవాడైన ఆదిబాబు ఇక లేడన్న వార్తను ఆ తల్లి జీర్ణించుకోలేక తుది శ్వాస విడిచారు. కాగా ఆదిబాబుకు భార్య లక్ష్మీ పార్వతిదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య పార్వతి మాచవరం పంచాయతీ 4వ వార్డు మెంబరు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,000
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-15,500
కొత్త (పచ్చి) కాయ	14,000-14,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

విలేకరులమంటూ నగదు డిమాండ్..

ఉప్పలగుప్తం: తాము విలేకరులమంటూ కొంతమంది వ్యక్తులు తన లారీని అడ్డుకుని నగదు డిమాండు చేశారని యాజమాని పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి ఉప్పలగుప్తం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పలగుప్తం మండలం పెదగాడవిల్లి నుంచి మట్టిని తీసుకెళుతున్న లారీని ఆపి విలేకరులమంటూ గుర్తింపు కార్డులు చూపించారని, నగదు డిమాండు చేశారని శేఖర్, వెంకటరమణ, జాన్‌రత్నంలపై ముమ్మిడివరానికి చెందిన లారీ యాజమాని రెడ్డి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. మరోవైపు తనను లారీతో ఢీకొట్టి, గాయపరిచి దౌర్జన్యం చేశారంటూ ఓ పత్రికా విలేకరి వెంకటరమణ.. లారీ యాజమాని రెడ్డి శ్రీనివాసరావు, డ్రైవరు ఒగూరి దుర్గాప్రసాద్‌లపై ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం


ఉచ్చిలి పొలాల్లో నేలకు చేరువలో విద్యుత్తు తీగలు

ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు

ఉచ్చిలి గౌడపేట సమీపంలో పంట పొలాలకు సంబంధించిన మోటార్ విద్యుత్తు కనెక్షన్ సర్వీసు వైరు నేలకు చేరువలో ఉండటంతో రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు అనేక మంది నిత్యం అటువైపు రాకపోకలు సాగిస్తుంటారు. వేలాడుతున్న వైర్లను సరిచేయాలని కోరుతున్నారు. దీనిపై ఏఈ అశోక్ మాట్లాడుతూ, వైర్లను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

తొలగించిన కొబ్బరి చెట్లకు నష్టపరిహారం ఇవ్వాలి

అంబాజీపేట, న్యూస్‌టుడే: కె.పెదపూడిలో ఓఎన్‌జీసీ సైటు సమీపంలో రహదారికి ఇరువైపులా ఉన్న కొబ్బరి చెట్లను సంబంధిత ఓఎన్‌జీసీ రిగ్గు అధికారులు తమ కార్యకలాపాల కోసం తొలగించారు. సంబంధిత నష్టపరిహారం ఇవ్వలేదని స్థానిక శివాలయం వీధిలోని పలువురు శుక్రవారం సైటు వద్ద ఆందోళన చేపట్టారు. దీంతో ఎస్సై కె.చిరంజీవి ఘటనా ప్రాంతానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. వారి వివరాలను సేకరించారు. దీనిపై ఓఎన్‌జీసీ అధికారులతో చర్చించి నష్టపరిహారం అందేలా చూస్తామని చెప్పడంతో స్థానికులు ఆందోళన విరమించారు.

రోడ్డు వేశారు.. వంతెన నిర్మాణం మరిచారు

న్యూస్‌టుడే – మామిడికుదురు

వైనతేయ కుడి కరకట్టను ఆనుకుని పాశర్లపూడి-అప్పనపల్లి మధ్య లంక గ్రామాలకు కాజ్‌వే మీదుగా రాకపోకలు సాగించేందుకు ప్రజలు కలవరపడుతున్నారు. ఇక్కడి ప్రధాన పాటురేవుపై ఉన్న శిథిల కల్వర్టు ఇటీవల వరదల తాకిడికి మరింత దుర్భరంగా తయారయింది. పాశర్లపూడి నుంచి అప్పనపల్లి వరకు 2.62 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు పూర్తయినా, మధ్యలో కాజ్‌వే స్థానే కొత్త వంతెన నిర్మాణ పనులను నిలిపివేయడంతో ఆశించిన ప్రయోజనం నెరవేరలేదు. అంచులు విరిగి, రంధ్రాలు పడి కొంత భాగం దెబ్బతిన్న శిథిల కాజ్‌వేపై వాహనాలు తిరిగే సమయంలో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. గత వైకాపా పాలకులు నిధులు మంజూరు చేయకపోవడంతో గుత్తేదారు మధ్యలోనే పనులను నిలిపివేయడంతో ఈ దుస్థితి నెలకొంది.

కొత్త వంతెనతోనే లంక గ్రామాలకు ఊరట

అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాల్లో 13,373 మంది జనాభా ఉన్నారు. ఇక్కడ కొబ్బరి, దాని అనుబంధ పరిశ్రమలతో రైతులు ఉపాధి పొందుతున్నారు. ప్రజలు, వ్యవసాయ ఉత్పత్తులను తరలించే వాహనాలు కాజ్‌వేపై రాకపోకలు చేయాల్సి ఉంది. అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయానికి వెళ్లే భక్తులు కూడా ఇబ్బంది పడుతున్నారు. గత జులై, ఆగస్టులో మూడుసార్లు వచ్చిన వరద ఉద్ధృతికి అంతంతమాత్రంగా ఉన్న కాజ్‌వే మరింత శిథిలమైంది. పాశర్లపూడి-అప్పనపల్లి మధ్య రోడ్డు, వంతెన నిర్మాణానికి 2022లో రూ.14 కోట్లు మంజూరైంది. రోడ్డు పనులు గత ఏడాది పూర్తి చేసినా దానికి రెండు వైపులా బెర్మలు వేయలేదు. కాజ్‌వేకు రెండు వైపులా 200 మీటర్ల మేర రోడ్డును అలా వదిలేశారు. రూ.5 కోట్ల వ్యయంతో అక్కడ ఏడున్నర మీటర్ల వెడల్పుతో 65 మీటర్ల పొడవైన కొత్త వంతెన నిర్మించేందుకు చేపట్టాల్సిన పనులు ఆదిలోనే నిలిచిపోయాయి.


అంచులు విరిగిన కాజ్‌వేపై వాహనాలు

త్వరలో పనులు చేపడతాం..

పాశర్లపూడి కరకట్ట దిగువలో అప్పనపల్లి పాటురేవుపై ఉన్న శిథిల కాజ్‌వే స్థానే కొత్త వంతెన నిర్మాణానికి త్వరలోనే పనులు చేపడతాం. అక్కడ మిగతా రోడ్డు పనులు పూర్తి చేయడంతోపాటు వాటికి రెండు వైపులా పటిష్ఠంగా బెర్మలు ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం కాజ్‌వేపై రాకపోకలకు ఇబ్బందులు లేకుండా కార్యాచరణ చేస్తాం.

– కె.సురేష్, ర.భ.శాఖ ఏఈఈ, రాజోలు

ఆదుర్రు బౌద్ధ స్థూపాన్ని సందర్శించిన కలెక్టర్

మామిడికుదురు, న్యూస్‌టుడే: పర్యాటకాభివృద్ధికి సంబంధించి కార్యాచరణలో భాగంగా ఆదుర్రులోని ఆది బౌద్ధ స్థూపాన్ని జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నదీతీరంలో నిర్మితమైన పడవ విహార కేంద్రం పరిస్థితిని పరిశీలించారు. తహసీల్దారు బి.మృత్యుంజయరావు ఆయన వెంట ఉన్నారు.

మలికిపురం: తూర్పుపాలెంలో ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ పరిశీలించారు. రీసైక్లింగ్ విధానం, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, వాటికి ఇచ్చే ధర, రీసైక్లింగ్ ఉత్పత్తుల ఎగుమతి తదితర అంశాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు సీఎస్ రాజు, ఆర్.ఐ వేణు, సర్పంచులు గుల్లింక మురళీవెంకటసత్యనారాయణ, యెనుముల నాగు, నాయకులు సుందర బ్రహ్మయ్య, అడబాల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఆర్టీసీ ఆన్‌లైన్ సేవల నిలిపివేత

రాజోలు, న్యూస్‌టుడే: ఆర్టీసీ వెబ్‌సైట్ ఆధునికీకరణ కారణంగా 5, 6 తేదీల్లో ఆన్‌లైన్ సేవలు నిలిపివేస్తున్నట్లు డిపో మేనేజర్ బి.భాస్కరరావు తెలిపారు. ఆయా తేదీల్లో విద్యార్థుల బస్ పాస్ సేవలు అందుబాటులో ఉండవన్నారు. 7 నుంచి అన్నిసేవలు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టరుగా పెద్దకాపు ప్రమాణ స్వీకారం నేడు

మలికిపురం: రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టరుగా గుండుబోగుల నరసింహారావు(పెద్దకాపు) విజయవాడలో జరిగే కార్యక్రమంలో శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శనివారం ఉదయం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కూటమి నాయకులు, అభిమానులు తరలి వెళ్లనున్నారు.

ప్రతి సోమవారం ప్రజా దర్బార్: బండారు


కొత్తపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. శుక్రవారం ఆత్రేయపురంలోని పార్టీ కార్యాలయంలో మండల తెదేపా అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు అధ్యక్షతన జరిగిన తెదేపా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. శిథిలావస్థకు చేరుకున్న లొల్ల హెడ్‌లాకుల స్థానే కొత్తవి నిర్మించేందుకు రూ.70 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వద్దిపర్రు నుంచి బొబ్బర్లంక వరకు రహదారి అభివృద్ధికి ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించిందన్నారు. నాయకులు ఆకుల రామకృష్ణ, కరుటూరి నరసింహారావు, దుగ్గిరాల సుబ్బలక్ష్మి, బండారు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం కొత్తపేటలోని బండారు బులిసత్యంచంద్రావతి కాపు కల్యాణ మండపంలో మండల పార్టీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. నాయకులు ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్, భూసి జయలక్ష్మి, భాస్కరరావు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావిస్తా


ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజుకు సమస్యలు చెబుతున్న అధ్యాపకులు

మలికిపురం, న్యూస్‌టుడే: మలికిపురంలోని ఎమ్వీఎన్, జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుల జీతాలు, ఎయిడెడ్ ట్రస్టు ఉపకరణలపై శాసనమండలి సమావేశంలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు చెప్పారు. జీతాల కోసం 24 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మలికిపురం డిగ్రీ కళాశాల అధ్యాపకుల ఆందోళన శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. పది నెలలుగా యాజమాన్యం జీతాలు ఇవ్వడం లేదని ఎమ్మెల్సీకి అధ్యాపకులు తెలిపారు. ఆయన స్పందిస్తూ కళాశాల పాలకవర్గం వైఖరిని తప్పు పట్టారు. ఇది మానవ హక్కులను కాలరాయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధ్యాపక మండలి గురువు కళాశాల యాజమాన్యంతో కూడా అధ్యాపకులను కలిసి మద్దతు తెలిపింది. గెడ్డం పేరాజు, మాజీ ఉప సర్పంచి సత్యనారాయణ, యూటీఎఫ్ మాజీ ఎంపీపీ గుబ్బల నాయకుడు సీహెచ్ సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో లక్ష్యాన్ని చేరుకుంటాం..



అంబాజీపేట, న్యూస్‌టుడే: వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఈ ఏడాది నిర్ణయించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని అంబాజీపేట వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమిషనర్ టి.ధర్మారావు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన 'న్యూస్‌టుడే'తో శుక్రవారం మాట్లాడారు. వ్యాపారులు నిబంధనల ప్రకారం వ్యాపార లావాదేవీలకు సంబంధించిన రిటర్న్స్ దాఖలు చేయకపోతే సంబంధిత లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. అంబాజీపేట, రావులపాలెం, కొత్తపేట, రాజోలు, సఖినేటిపల్లి, మలికిపురం, పి.గన్నవరం, మామిడికుదురు మండలాలకు సంబంధించి 2,400 మంది వ్యాపారులు ఉన్నారన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 2024-25కు రూ.45.53 కోట్ల మేర వాణిజ్య పన్నుల వసూళ్లను అంబాజీపేట సర్కిల్ పరిధిలో వసూలు చేసేందుకు లక్ష్యం ఉందని వారు తెలిపారు.

జగన్మాతా.. నమోస్తుతే


ఉచ్చిలిలో...


వాడపల్లిలో...


నగరంలో...


మలికిపురంలో...


కొత్తపేటలో...


రాజోలులో...


ఆలమూరులో...


రావులపాలెంలో...

దేవీ నవరాత్రి మహోత్సవాలు రెండో రోజు శుక్రవారం ఘనంగా జరిగాయి. గ్రామాల్లో ఆచారాలను అనుసరించి అమ్మవార్లు గాయత్రీదేవి, బాలాత్రిపురసుందరీదేవి, లక్ష్మీదేవి తదితర అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో అమ్మవార్లకు కుంకుమార్చన, పుష్పార్చనలు నిర్వహించి, లలితాపారాయణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం, రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి, కొత్తపేట, రావులపాలెం పట్టణం, ఆలమూరు, రావులపాలెం గ్రామీణం, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి


పల్లిపాలెంలో కనకదుర్గమ్మ


రావులపాడులో కుంకుమ పూజల్లో మహిళలు


అంబాజీపేట వాసవీమాత ఆలయంలో


జి.పెదపూడిలో శ్రీ వైష్ణవి కనకదుర్గ అమ్మవారు

కాకినాడ సభకు తరలిరావాలి


మహాసేన రాజేష్‌ను సత్కరిస్తున్న నేతలు

అంబాజీపేట: ఎస్సీ వర్గీకరణ, ఎస్సీల మత స్వేచ్ఛ అంశాలపై కాకినాడలో ఈనెల 12న నిర్వహించే సభకు అధికంగా సామాజిక వర్గీయులు తరలిరావాలని తెదేపా నేత, మహాసేన రాజేష్ పిలుపునిచ్చారు. మండలంలోని పుల్లేటికుర్రుకు ఆయన శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచి జల్లి బాలరాజు, మాజీ సర్పంచి నూకపెయ్యి చిన్న, తెదేపా నేత చిన్నం బాలవిజయరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎన్ఎస్ఎన్.వర్మ, బట్టు బంగారం పాల్గొన్నారు.

వీఆర్వో బాపన్నదొర మృతి



ఆత్రేయపురం, న్యూస్‌టుడే: లొల్ల గ్రామ రెవిన్యూ అధికారి (వీఆర్వో) కోసు బాపన్న దొర (51) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. ఈయనకు ఒక కుమార్తె, కుమారుడు, భార్య ఉన్నారు. ఏజెన్సీలోని స్వగ్రామం పిడతమామిడిలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. దొర మృతి పట్ల ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, తహసీల్దారు టి.రాజేశ్వరరావు, ఆర్ఐ భవాని, వీఆర్వో సంఘ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మామిడికుదురు: స్థానిక 216 జాతీయ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మలికిపురం మండలం గొల్లపాలేనికి చెందిన కొంబత్తుల శ్రీనివాసరావు (38) అక్కడికక్కడే మృతి చెందారు. పొక్లయిన్ నిర్వహణ చేసే శ్రీనివాసరావు దానికి సంబంధించిన పరికరాలను తెచ్చేందుకు కొత్తపేట వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు నగరం ఎస్సై చైతన్యకుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ర్యాలి (ఆత్రేయపురం): ప్రసిద్ధ క్షేత్రం ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన జయంతి వెంకటసూర్యనారాయణ మూర్తి, సురేష్, రాజ్యలక్ష్మి, కార్తికేయ కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.50,116 విరాళం అందించారు. వీరికి దేవస్థానం సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించి అభినందించారు.

అప్పనపల్లి ఇన్‌ఛార్జి ఏసీగా సత్యనారాయణరాజు



మామిడికుదురు: దేవాదాయ శాఖ కమిషనరు ఎస్.సత్యనారాయణ ఆదేశాల మేరకు అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయ ఇన్‌ఛార్జి ఏసీగా అయినవిల్లి దేవస్థానం ఈవో ఎం.సత్యనారాయణరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పూర్తి అదనపు బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఉద్యోగులతో మాట్లాడుతూ ఆలయ పురోభివృద్ధికి అంతా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

విద్యుత్తు కోతలపై సీపీఐ నిరసన

మలికిపురం: నియోజకవర్గంలో విద్యుత్తు కోతలు, పెరిగిన ఛార్జీలకు నిరసనగా సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో మలికిపురం విద్యుత్తు సబ్‌స్టేషను వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, పిచ్చిక గంగాధరరావు, మేడిచర్ల సత్యనారాయణ, చెల్లుబోయిన తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కుకింగ్ వర్కర్ల సంఘ భవనం ప్రారంభం

అంబాజీపేట: అంబాజీపేట మండల కుకింగ్, కేటరింగ్ హెల్పర్స్ యూనియన్ కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు సలాది సూరిబాబు శుక్రవారం ప్రారంభించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

ఆత్రేయపురం: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. ఆత్రేయపురం మండలం వాడపల్లికి చెందిన ఏపుగంటి ధనరాజు కుమార్తె సంధ్యారాణికి యానాంకు చెందిన సలాది నాగదుర్గారావుతో 2015లో వివాహమైంది. తనను అనుమానించడంతోపాటు అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని సంధ్యారాణి ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో అయిదుగురికి గాయాలు

రావులపాలెం గ్రామీణం: దేవరపల్లి గ్రామ శివారు రాజుగారిదొడ్డి ప్రాంతంలో పిచ్చి కుక్క శుక్రవారం దాడి చేసి అయిదుగురిని గాయపరిచింది. యార్లగడ్డ గన్నెమ్మ, పొనుకుపట్ల శాంతమ్మ, చిట్టూరి జ్యోతిలకు తీవ్రంగా, మరో ఇద్దరు పురుషులను స్వల్పంగా గాయపరిచింది. స్థానికులు వీరిని కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అమలాపురం
• అమలాపురం • ముమ్మిడివరం


కృష్ణబాబుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధికి వినతి

అమలాపురం పట్టణం: అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రిని మూడు అంతస్థుల్లో అభివృద్ధి చేయాలని వైద్యఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణబాబును ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కోరారు. ఈ మేరకు అమరావతిలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆదేశాలతో 40 గదులతో పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కాట్రేనికోన: చర్చ్ ఆఫ్ ది లివింగ్ గాడ్ మినిస్ట్రీస్ పాస్టర్ నవుడూరి జోసఫ్‌రాజు ఆధ్వర్యంలో శుక్రవారం రామస్వామితోటలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి వైద్యపరీక్షలు చేశారు. మధుమేహం, రక్తపోటు వంటి పరీక్షలతో పాటు అవసరమైన మందులను ఉచితంగా అందించారు. యు.జాన్సన్, శ్యాంసన్, డానియేలురాజు పాల్గొన్నారు.


రోగికి చికిత్స అందిస్తున్న వైద్యురాలు

మహిళలు చట్టపరమైన అంశాలు తెలుసుకోవాలి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: మహిళలకు సంబంధించిన రక్షణ చట్టాలు, న్యాయపరమైన అంశాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి వి.నరేష్ పేర్కొన్నారు. అమలాపురం ఐసీడీఎస్ మందిరంలో 'విధాన్ సే సమాధాన్' పేరిట అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, మహిళా న్యాయవిజ్ఞాన సదస్సు, జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయసేవాధికార సంస్థల ఆధ్వర్యంలో సేవలు లభిస్తాయని వివరించారు. ఏవైనా వేధింపులు, సమస్యలు వస్తే న్యాయాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వి.గౌరీశంకరరావు, న్యాయవాదులు వెంపరాల భాస్కరశాస్త్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంచాలకులు డాక్టర్ శివశంకర్‌ప్రసాద్, కముజు శ్రీనివాస్, సి.విజయకుమార్, పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి వి.నరేష్



అమలాపురం వైష్ణవి కనకదుర్గమ్మ


కల్వకొలను వీధిలోని వేపచెట్టు కనకదుర్గ


భవానీనగర్ కల్యాణదుర్గ


అమలాపురం వాసవిమాత


శ్రీకామాక్షీ ఏకాంబరేశ్వరి


శ్రీబాలాత్రిపురసుందరీదేవి


గోదశి వారి పాలెంలోని విజయదుర్గ అమ్మవారికి పండ్లతో అలంకరణ

గాయత్రీ.. నమోస్తుతే..!

దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం అమ్మవారు వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చి పూజలు చేశారు. అమలాపురం పట్టణం కాలేజీరోడ్డులోని బాలాత్రిపురసుందరీదేవి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కోటి కుంకుమార్చన నిర్వహించారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

– న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం, కాట్రేనికోన, ముమ్మిడివరం


అమలాపురం: బాలాత్రిపురసుందరీదేవికి కుంకుమ పూజలు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య

అమలాపురం: 79811 19595, ముమ్మిడివరం: 80085 74166

స్పందనకు వందనం

పూడిక తీశారు..

సమస్య: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బళ్లగేటు సెంటర్‌లో కాలువ పూడిపోవడంతో మురుగు దిగువకు దిగక దుర్వాసన కొడుతోంది. అధికారులు స్పందించి డ్రెయిన్‌లో పూడిక తొలగించి సమస్యను పరిష్కరించాలి. - పి.సత్యనారాయణ, స్థానికుడు

పరిష్కారం: డ్రెయిన్‌లో పూడిక సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించి సమస్యను పరిష్కరించారు. – న్యూస్‌టుడే, ముమ్మిడివరం

సమస్య: ఉప్పలగుప్తం పంచాయతీ పరిధి పెద్దూరు, చీకట్లపాలెం, మధురపేట తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. అధికారులు స్పందించి మరమ్మతుల చేపట్టాలి. - స్థానికులు

పరిష్కారం: పరిస్థితిని ఈవోపీఆర్డీ గౌరీకుమారికి తెలుపగా, స్థానిక సర్పంచి చిన్నవరాజు ఆధ్వర్యంలో వీధి దీపాలకు మరమ్మతుల చేపట్టారు.

సమస్య: గొల్లవిల్లి నుంచి ఉప్పలగుప్తం వెళ్లే రహదారిలో రోడ్డు పక్కన చెత్త వేయడంతో వాహనదారులకు, గ్రామస్థులకు ఇబ్బందిగా మారింది. -స్థానికులు

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి సాయికి తెలుపగా సర్పంచి శ్రీదుర్గ సూచనల మేరకు జేసీబీతో చెత్తను తరలించేలా చర్యలు చేపట్టారు.

సమస్య: పెనుమల్ల పరిధిలో కొన్ని వీధి దీపాలు వెలగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. - స్థానికులు

పరిష్కారం: సమస్యను పంచాయతీ సర్పంచి వంకా ఏడుకొండలు దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

– న్యూస్‌టుడే, కాట్రేనికోన, ఉప్పలగుప్తం

ఆక్రమించేస్తున్నారు..

పరిశీలన

జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలో సెంటుభూమి ధర రూ.లక్షల్లో ఉంది. దీంతో కాలువలు, పోరంబోకు స్థలాలపై అక్రమార్కుల కన్ను పడింది. ప్రధానంగా కుమ్మరి కాలువ ఆక్రమణలకు గురవుతోంది. సుమారు పది కిలోమీటర్ల పొడవుండే ఈ కాలువ నల్లవంతెన, బైపాస్‌రోడ్డు, బస్టాండ్‌రోడ్డు, నారాయణపేట, కొంకాపల్లి, పేరూరు ప్రాంతాలను కలుపుతుంది. గత ప్రభుత్వ పాలనలో దీని గట్టుపై ఆక్రమణలు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో పక్కా నిర్మాణాలు చేపట్టి అద్దెకు ఇచ్చేయడమే కాక అధిక ధరలకు విక్రయించేశారు.

–న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

గతంలో కోర్టు ఉత్తర్వుల మేరకు అధికారులు అమలాపురం పట్టణంలోని చిన్నవంతెన, సీతాపతిరావుపేట వద్ద మురుగు కాలువపై ఆక్రమణలు తొలగించి రహదారి నిర్మించేలా చర్యలు చేపట్టారు. బస్టాండ్ నుంచి కొంకాపల్లికి వెళ్లే దారి అవ్వడంతో వాహనదారులు వినియోగించుకుంటున్నారు. ఇప్పుడు ఇక్కడి మురుగు కాలువను సైతం ఆక్రమించేస్తున్నారు. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడుతున్నారు. వడ్డెరకాలనీ, శ్రీనివాస కాలనీకి వెళ్లే నూతన రహదారి పక్కనే కొంతమంది ఆక్రమించుకుని షెడ్ల నిర్మాణాలు చేపట్టి అద్దెకు, అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. అటువైపు మున్సిపల్, డ్రెయిన్స్ అధికారులు కన్నెత్తి చూడటంలేదు. ఇక్కడ 16 అడుగులు వేయాల్సిన రహదారిని 12 అడుగులు మాత్రమే వేసి వదిలేయడం గమనార్హం. మురుగుకోడు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టడం వల్ల మురుగునీరు కాలువలోకి వెళ్లకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.


అమలాపురం వడ్డెరకాలనీ రోడ్డులో దుకాణాలు

రిజిస్ట్రేషన్లు, విద్యుత్తు సరఫరా..

ఆక్రమిత స్థలాలకు గతంలోనే పట్టాలు ఇచ్చారని మభ్యపెడుతూ రిజిస్ట్రేషన్ల పత్రాలు సృష్టించి ఇంటి పన్నులను వేయించుకుంటున్నారు. వాటికి అధికారులు విద్యుత్తు సరఫరా ఇచ్చేయడంతో అందినకాడికి దోచేస్తున్నారు. ప్రజాప్రతినిధులు అండ ఉండటంతో అధికారులు అటువైపు చూడటంలేదు. దీంతో ఎవరికివారే ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. చెరువులు, కాలువలు కబ్జాలతో నిండిపోవడంతో కాలువలు పొంగి రహదారులపై మురుగు పారుతోంది.


శివాలయం ఎదురుగా నిర్మించిన షెడ్డు

చర్యలు తీసుకుంటాం..

అమలాపురంలో కుమ్మరికాలువ 24 కి.మీ. విస్తీర్ణంలో ఉంది. ఎంత ఆక్రమణకు గురైందో సర్వే చేయాలి. కొత్త జేఈ వచ్చిన తర్వాత తహసీల్దారుకు నివేదిక అందిస్తాం. గతంలో మురుగు కాలువలపై నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు అందజేశాం. ఆక్రమణదారులు ఖాళీ చేసేలా హెచ్చరిస్తాం.

- జి.హిమరత్న, డీఈ, జిల్లా డ్రెయిన్స్

సీఎంను కలిసిన ఎమ్మెల్యే గొల్లపల్లి

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి రాష్ట్ర ముఖ్యమంత్రి రంగసామిని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ శుక్రవారం కలిశారు. యానాంలోని మత్స్యకారులకు ఓఎన్‌జీసీ విడుదల చేసిన పరిహారం త్వరితగతిన వారి ఖాతాల్లో జమచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కొవిడ్ సమయంలో మృతి చెందిన వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వ సాయం అందలేదని.. యానాంలో 66 కుటుంబాలకు గానూ 14 కుటుంబాలకు మాత్రమే రూ.50 వేలు ఆర్థిక సాయం అందిందన్నారు. మిగిలిన కుటుంబాలకు సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే కోరారు.


ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: చెక్కు బౌన్సు కేసులో ఓ వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష పడింది. ముమ్మిడివరం నగర పంచాయతీ చిప్పలపాలేనికి చెందిన సరిపెల్ల చినవీరవెంకట సత్యనారాయణరాజు వద్ద కొమానపల్లికి చెందిన కోలా వెంకటేశ్వరరావు 2019లో రూ.4.50 లక్షల అప్పు తీసుకున్నారు. అప్పు నిమిత్తం ఇచ్చిన చెక్కు బ్యాంకులో చెల్లుబాటు కాకపోవడంతో సత్యనారాయణరాజు కోర్టును ఆశ్రయించారు. నేరం రుజువు కావడంతో వెంకటేశ్వరరావుకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ముమ్మిడివరం జూనియర్ సివిల్‌జడ్జి మహ్మద్ రహంతుల్లా శుక్రవారం తీర్పునిచ్చారు.

హత్య జరిగిన స్థలం పరిశీలన

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం అనాతవరంలో ఓ హత్య కేసుకు సంబంధించి అమలాపురం డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ ఘటనా స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. అనాతవరం శివారు భోగాలతిప్పకు చెందిన పి.రమేశ్‌కుమార్ 2022 సెప్టెంబరు 25 రాత్రి సమయంలో తన ఇంటి సమీపంలో హత్యకు గురయ్యారు. దీనిపై అప్పట్లో గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లుగా కేసు నమోదైంది. కేసు పురోగతి లేకపోవడంతో.. పాత కేసుల పునఃపరిశీలనలో భాగంగా డీఎస్పీ ఘటనా స్థలాన్ని.. వివరాలను క్షుణ్నంగా పరిశీలించారు. డీఎస్పీ వెంట ముమ్మిడివరం సీఐ మోహనకుమార్ ఉన్నారు.

జూద శిబిరంపై దాడి

ఉప్పలగుప్తం: చినగాడవిల్లి పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై శుక్రవారం దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.3,440 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మైదానంలో గడ్డి తొలగించాలి

చెయ్యేరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని మైదానంలో గడ్డి ఏపుగా పెరిగింది. విద్యార్థులు ఆడుకునేటప్పుడు ఇబ్బంది పడుతున్నారు. పాములు సైతం సంచరించే అవకాశం ఉంది. పాఠశాల యాజమాన్యం స్పందించి గడ్డిని తొలగించే పనులు చేపట్టాలి. హెచ్‌ఎం శేషసాయిని అడగగా మైదానంలో గడ్డి తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, కాట్రేనికోన



ముందుకెళ్లేదెలా మరి..!

అమలాపురం పట్టణం నుంచి రోళ్లపాలెం మీదుగా ఇమ్మిడివరప్పాడు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. గుంతలమయంగా ఉండటంతో ప్రయాణికులు రాకపోకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో రాత్రివేళల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాపోతున్నారు. ఈ సమస్యపై పంచాయతీరాజ్ డీఈఈ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామన్నారు.

– న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం



ప్రజా ఉత్సవాలపై సమీక్ష

యానాం, న్యూస్‌టుడే: యానాంలో వచ్చే ఏడాది జనవరి 6 నుంచి 8 వరకు నిర్వహించే ప్రజా ఉత్సవాలు, ఫల, పుష్ప ప్రదర్శన నిర్వహణకు సంబంధించి పుదుచ్చేరి ప్రభుత్వ దిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్థానిక పరిపాలనాధికారి కార్యాలయంలో మునిస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రజా ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అధికారులు చర్యలు చేపట్టాలని కృష్ణారావు సూచించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

శాస్త్రీయ దృక్పథం పెంపునకే సైన్సు సంబరాలు

యానాం: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికే జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్సు సంబరాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర పాట్రన్ చల్లా రవికుమార్ అన్నారు. యానాం మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆనాల వీరభద్రరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్లాక్ స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విభాగంలో ఎంజీజీ బాలుర ఉన్నత పాఠశాల, ఎన్‌ఆర్‌సీ స్కూల్ ప్రథమ స్థానంలోను, పీకే ప్రభుత్వ హైస్కూల్, నారాయణ టెక్నో స్కూల్ ద్వితీయ స్థానంలోను, కేఎన్‌జీ ప్రభుత్వ హైస్కూల్, రీజెన్సీ పబ్లిక్ స్కూల్ తృతీయ స్థానాల్లో నిలిచాయన్నారు. విజేతలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న పది పాఠశాలలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు డి.త్రిమూర్తులు 'ప్లే విత్ పీరియడ్ కీ టేబుల్' అనే పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీవీ సత్యనారాయణ, ఆర్.కృష్ణారావు, దాట్ల దేవదానం రాజు, మొహిబుల్లా ఖాన్, కడియం వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న రవికుమార్

సమగ్ర పోషణ.. సమీకృత అభివృద్ధి

• దశ మారనున్న అంగన్‌వాడీ కేంద్రాలు

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

ఆరేళ్ల లోపు చిన్నారుల నుంచి గర్భిణులు, బాలింతలకు సమగ్ర పోషణ, పరిరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను మెరుగుపరిచేందుకు సక్షం(సిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్) పేరుతో శ్రీకారం చుడుతోంది. అమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 43 కేంద్రాలు ఈ పథకానికి ఎంపికయ్యాయి.

ప్రాజెక్టు పరిధిలో ఇలా..

అమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అమలాపురం పట్టణం, అమలాపురం గ్రామీణం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో మొత్తం 235 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 43 కేంద్రాలు సక్షం పథకంలో అభివృద్ధి చేసేందుకు అవకాశం లభించింది. ఆయా కేంద్రాల్లో కల్పించే సదుపాయాలపై ఇప్పటికే అధికారులు సమాయత్తమవుతున్నారు.

వివరాలు ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య	: 235
పిల్లలు(ఆరు నెలల నుంచి మూడేళ్లు)	: 6,312
మూడేళ్ల నుంచి ఆరేళ్లవారు	: 4,952
గర్భిణులు	: 1,222
బాలింతలు	: 1,202

సక్షం పథకానికి మండలాల వారీగా ఎంపికైన కేంద్రాలు

అమలాపురం గ్రామీణం	: 12
అల్లవరం	: 24
ఉప్పలగుప్తం	: 07

కల్పించే సదుపాయాలివే..

● తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణ, బాలల శారీరక, మానసిక ఎదుగుదల, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా సదుపాయాలను కల్పించనున్నారు. ● చిన్నారులకు కుర్చీలు, టేబుళ్లు, ఇతర వసతులను సమకూర్చనున్నారు. ● పోషణ వాటిక పేరుతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆవరణలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కల పెంపకం చేపట్టనున్నారు. పండిన వాటితో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు వండి పెట్టనున్నారు. ● చిన్నారులను ఆకట్టుకునే విధంగా బోధన చేయడంతో పాటు ఎల్‌ఈడీ టీవీని ఏర్పాటు చేసి ఆటపాటల ద్వారా పాఠాలను బోధించనున్నారు. ● సురక్షితమైన తాగునీరు అందించేందుకు శుద్ధీకరణ యంత్రాలను అమర్చి చిన్నారులు రోగాల బారిన పడకుండా చర్యలు చేపట్టనున్నారు. ● కేంద్రాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు వివిధ రకాల బొమ్మలు, చిత్రాలు, ఆట వస్తువులు సమకూర్చనున్నారు.


అమలాపురంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యాబోధన

ఆదేశాలొచ్చాయి..

సక్షం పథకానికి సంబంధించి అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేయడం జరిగింది. ఇందులో భాగంగా ప్రాజెక్టు పరిధిలో 43 కేంద్రాలు ఎంపికయ్యాయి. వీటన్నింటిలోనూ ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా త్వరలోనే సదుపాయాల కల్పన చేపట్టనున్నాం.

- కె.వి.ఎల్.డి.కుమారి, సీడీపీవో, అమలాపురం

మండపేట

•మండపేట •రామచంద్రపురం

స్తంభానికి అల్లుకున్న పాదుల తొలగింపు



అల్లుకున్న పాదులు తొలగించిన తరువాత ఇలా

మండపేట(ద్వారపూడి), న్యూస్‌టుడే: మండపేట పట్టణం టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధిలో విద్యుత్తు స్తంభానికి పచ్చని పాదులు అల్లుకున్నాయని వాటి ద్వారా విద్యుత్తు ప్రవహించే అవకాశం ఉందనిప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై ఈనెల 3న ఈనాడులో 'తొలగించకుంటే ప్రమాదమే' శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యుత్తు శాఖ ఏఈ ఎం.సాంబశివరావు స్పందించారు. స్తంభానికి అల్లుకున్న పాదుల తొలగింపునకు సత్వర చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రేపు దివ్యాంగ అభ్యర్థులకు ముఖాముఖి

రామచంద్రపురం: రామచంద్రపురం వి.ఎస్.ఎం కళాశాలలో ఈ నెల 6న వికాస, సార్థక్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు (దివ్యాంగులకు) ముఖ్యంగా ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఈ శిక్షణకు ఇంటర్, డిగ్రీ, బి.టెక్ ఉత్తీర్ణులైన 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సుగల స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. 45 నుంచి 60 రోజులు ఆన్‌లైన్ శిక్షణ అనంతరం ఎంపిక నిర్వహిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు పలు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ఉన్న అర్హులైన దివ్యాంగులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆసక్తిగల వారు ముఖాముఖికి ఆదివారం హాజరు కావాలని మంత్రి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

చెత్త కుప్పలతో దుర్వాసన



సమస్య: సోమేశ్వరంలోని నాగ వంశీయుల పేట శివార్లలో రహదారి వెం) వేస్తున్న చెత్త కుప్పలతో దుర్వాసన వస్తోంది. సమస్యను పరిష్కరించాలి. -కె.శ్రీనివాస్, సోమేశ్వరం

సమాధానం: సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

-పి.వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శి, సోమేశ్వరం

– న్యూస్‌టుడే, రాయవరం

సమయం : ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
మండపేట : 80085 74183
రామచంద్రపురం: 80085 74191



అవార్డు అందుకుంటున్న మండపేట రూరల్ సీఐ దొరరాజు, పామర్రు ఎస్సై జానీబాషా

మండపేట రూరల్ సీఐకి ఏబీసీడీ అవార్డు

మండపేట గ్రామీణం: రాష్ట్ర స్థాయిలో ప్రముఖమైన కేసుల్లో త్వరిత గతిన దర్యాప్తు పూర్తిచేసిన మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు అవార్డు ఫర్ బెస్ట్ కేసు డిటెక్షన్ సెలక్ట్ అవార్డు(ఏబీసీడీ) అందుకున్నారు. ఈ సందర్భంగా డీజీపీ ద్వారకాతిరుమలరావు చేతులుమీదగా మంగళగిరిలో అవార్డును, నగదుపురస్కారాన్ని అందుకున్నారు. ఈయనతోపాటు రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, డాగ్ హేండ్లర్ నాగరాజును డీజీపీ అభినందించి వారికి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది, ఎస్సైలు సీఐని అభినందించారు.

పామర్రు ఎస్సై జానీబాషాకు...

పామర్రు: ఎస్సై షేక్‌జానీబాషాకు బెస్ట్ కేస్ డిటెక్షన్ అవార్డు దక్కింది. రాష్ట్ర స్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఈ అవార్డు బాషాకు దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాష్ట్ర డీజీపీ ద్వారకాతిరుమల రావు శుక్రవారం ఈ అవార్డును మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో బాషాకు అందచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 28 కేసులను ఈ అవార్డుకు ఎంపికకు పరిశీలించారు. అందులో నుంచి నాలుగు కేసులు ఉత్తమమైనవిగా ఎంపిక చేశారు. పామర్రు ఎస్సై బృందం మండలంలోని ఎర్రపోతవరంలో అంబేడ్కర్ విగ్రహం చేతికి చెప్పుల దండ వేయడం కేసులో తగిన చొరవ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కేవలం ఒక్క రోజులోనే నేరస్థుల్ని గుర్తించి శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చేసినందుకు, వారిని న్యాయస్థానంలో ప్రవేశపెట్టి చట్టప్రకారం శిక్ష పడేలా చేసినందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. అవార్డు కింద ప్రశంసాపత్రం, ఈ బృందానికి మొత్తం రూ.20వేల నగదు బహుమతిని డీజీపీ ఇచ్చారు. కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు, రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష; మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు తదితరులు బాషాను అభినందించారు.

చెత్త పన్ను వసూలుకు స్వస్తి

ప్రభుత్వ నిర్ణయంతో సర్వత్రా హర్షం


రామచంద్రపురం, మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మచిలీపట్నంలో జరిగిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఇకపై చెత్తపన్ను వసూలు చేయమని చెప్పారు. ఈ నెల 3వ తేదీ నుంచే చెత్త పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వం అతి సామాన్యుడిపైనా ఏడాదికి రూ. 720 చెత్తపన్ను విధించింది. ఈ పన్ను చెల్లించకపోతే ఇంటిపన్ను తీసుకోమని చెప్పడం, చెత్తపన్ను తప్పనిసరిగా చెల్లించాలని ఆంక్షలు పెట్టడంతో పట్టణ ప్రజల అసహనం వ్యక్తం చేశారు. 2021 డిసెంబరు నుంచి అమలైన చెత్త పన్ను స్వీకరణ కాస్త ఆలస్యమైనా ఇప్పటివరకు రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో రూ. 8లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పాత బకాయిలతో సహా చెత్త పన్ను చెల్లించవద్దని చెప్పారు. దీంతో ప్రతి ఏటా రామచంద్రపురం పట్టణ ప్రజలపై రూ. 7.5లక్షలు, మండపేట పట్టణంలో సుమారు 8.5లక్షల పన్ను భారం తగ్గిందనే చెప్పాలి.

పురపాలక సంఘం పేరు	రామచంద్రపురం	మండపేట
మొత్తం జనాభా	46,500	64,000
మొత్తం గృహాలు	11,625	12,900
మొత్తం వసూలు లక్ష్యం	రూ.7.5లక్షలు	రూ.8.5 లక్షలు
వసూలులైన సొమ్ము	రూ.3లక్షలు	రూ.5లక్షలు
రోజువారీ చెత్త ఉత్పత్తి	26 టన్నులు	30 టన్నులు



ఐదో వార్డులో చెత్తను తీసుకెళ్తున్న మున్సిపల్ కార్మికులు


కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది



కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు చంద్రబాబు నాయుడు గాంధీ జయంతి సందర్భంగా చెత్త పన్ను రద్దు చేయడం మాట నిలబెట్టుకోవడమే. చాలా సంతోషం కలిగించిన అంశం. పట్టణాల్లో గత ప్రభుత్వం చెత్త పన్ను విధించడం సరైన పద్ధతి కాదు. ఇంటిపన్నులో చెత్త సేకరణ, వీధిలైట్లు, రోడ్లు, డ్రైన్లు నిర్వహణ, ఇవన్నీ వచ్చేస్తాయి. మరలా చెత్త పన్ను ప్రజలపై వైకాపా ప్రభుత్వం భారం మోపడం విడ్డూరం. చంద్రబాబు చేసిన చెత్త పన్ను రద్దుపట్ల నిరుపేదలకే ఎక్కువగా మేలు జరుగుతుంది.

-కె.అమ్మన చౌదరి, విశ్రాంత ఉద్యోగి, రామచంద్రపురం

చాలా సంతోషం కలిగించింది



గత వైకాపా ప్రభుత్వం చెత్తపై పన్ను వేయడం పట్ల ప్రజల్లో చాలా వ్యతిరేకత వచ్చింది. చెత్తపన్నుపై సర్వత్రా విమర్శలు వచ్చినా ఆ ప్రభుత్వం లెక్కచేయలేదు. సామాన్యులకు మరింత భారంగా మారిన చెత్త పన్నును రద్దు చేస్తూ చంద్రబాబు తీసుకున్న నిర్ణయం సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం రద్దు నిర్ణయం చాలా సంతోషాన్నిచ్చింది.

- ఐ.వెంకటేశ్, మండపేట, పురపాలక సంఘం

చంద్రబాబు నిర్ణయం హర్షణీయం



చెత్తపై గత ప్రభుత్వం పన్ను విధించడం పట్ల అందరూ ఆశ్చర్యానికే గురయ్యారు. ఇంటిపన్నులో చెత్త పన్నులేదా అంటూ అవాక్కయ్యారు. ఇప్పుడు నిరుపేదల గురించి ఆలోచించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెత్తపై పన్నును రద్దు చేయడం హర్షణీయం. చెత్త పన్ను రద్దుతో సామాన్యులకు ఊరట లభించింది.

- బత్తుల శ్రావణి, 6వ వార్డు, మండపేట పురపాలక సంఘం

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా భాస్కరరావు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పేపకాయల భాస్కరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాజోలు డిపో మేనేజర్‌గా పనిచేసిన ఆయన బదిలీపై రామచంద్రపురం వచ్చారు. ఇప్పటి వరకు మేనేజర్‌గా పనిచేసిన కె.వెంకటేశ్వర్లు నిడదవోలు డిపోకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన భాస్కరరావు గతంలో 2012 నుంచి 2015 వరకు మూడేళ్ల పాటు రామచంద్రపురం డిపో మేనేజర్‌గా పనిచేశారు. అనంతరం రాజోలు, కాకినాడ డిపోలలో పనిచేశారు. ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తామన్నారు.


దోమల నివారణ మందు పిచికారీ

మండపేట, న్యూస్‌టుడే: దోమల నివారణకు డ్రైడే ఫ్రైడే కార్యక్రమం మండపేట పట్టణంలోని 30 వార్డుల్లో కొనసాగింది. కమిషనర్ రంగారావు ఆదేశాల మేరకు టిమోపాస్ లిక్విడ్‌ను వీధుల్లో పిచికారీ చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా నిర్మాణాలు చేయొద్దు

పామర్రు, న్యూస్‌టుడే: కోటిపల్లి స్నానఘట్టాల వద్ద కొందరు ఆక్రమించి కట్టడాలు నిర్మించడానికి ప్రయత్నాలు చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక మాన్సాస్ ట్రస్టు ప్రతినిధులు స్పందించారు. కోటిపల్లి రేవు ప్రాంతమంతా తమ ట్రస్టుకే చెందుతుందని, ఎవరూ కూడా ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఏ విధమైన నిర్మాణాలు చేయవద్దని హితవు పలికారు. దాంతో కట్టడం దారులు వెనక్కి తగ్గారు. భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వరద బాధితులకు చేయూత



మంత్రి సుభాష్‌కు చెక్కు అందజేస్తున్న మాజీ సైనికులు


రామచంద్రపురం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రామచంద్రపురం పట్టణానికి చెందిన మోడరన్ విద్యాసంస్థల అధినేత జి.వి.రావు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రూ.3లక్షల చెక్కును గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ఎ.రమాదేవి, తెలుగు యువత అధ్యక్షులు అక్కల రిశ్వంత్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: కోనసీమ ఎక్స్ సర్వీస్‌మెన్ సభ్యులు వరద బాధితుల సహాయార్థం రామచంద్రపురం పట్టణంలో శుక్రవారం రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి రూ.లక్ష చెక్కును అందజేశారు. డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోనసీమ ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, డి.ఎన్.మూర్తి, రాంబాబు, ఎం.ఎస్.నారాయణ, దుర్గా ప్రసాద్‌ల చేతులమీదుగా ముఖ్యమంత్రి సహాయనిధి పేరిట చెక్కును ఇచ్చారు. అనంతరం ఎక్స్ సర్వీసు వెల్ఫేర్ అసోసియేషన్ సమస్యలను మంత్రి సుభాష్‌తో చర్చించారు.



ముఖ్యమంత్రికి చెక్కు అందిస్తున్న జి.వి.రావు, కుమార్తె రమాదేవి

చిన్నారికి అభినందనలు



మోక్షితారెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఇండియా బుక్‌ఆఫ్ రికార్డుల్లో స్థానం సాధించిన రాయవరం మండలం మాచవరం గ్రామానికి చెందిన మోక్షితారెడ్డిని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శుక్రవారం అభినందించారు. ఏడాది వయసు ఉన్న మోక్షిత ఆల్ఫాబెట్స్ అన్ని చెప్పినందుకు ఐబీఆర్ అసోసియేషన్ గోల్డ్ మెడల్ బహూకరించింది. బుక్‌ఆఫ్ రికార్డుల్లో స్థానం కల్పించినట్లు మోక్షిత రెడ్డి తల్లిదండ్రులు ఆనంద్‌రెడ్డి, తేజశ్రీ తెలిపారు. ఈ మేరకు చిన్నారిని ఎమ్మెల్యే అభినందించారు. వెంకట కృష్ణారెడ్డి, కొవ్వూరి ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దోమలకు ఆవాసంగా ఖాళీస్థలాలు



పడమర ఖండ్రిక జగనన్న కాలనీలోని ఖాళీ స్థలంలో నిలిచిన మురుగునీరు

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలంలోని జగనన్న కాలనీల్లోని ఖాళీస్థలాలు దోమలకు ఆవాసంగా మారాయి. పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, మాచర, వడ్లమూరు, వల్లూరు, తదితర గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా మురుగునీరు నిలిచిపోయింది. ఇళ్ల నిర్మాణం చేపట్టకుండా ఖాళీగా వదిలేసిన స్థలాలన్నీ మురికి కూపాలుగా ఉన్నాయి. దీనివల్ల దోమల వ్యాప్తి ఎక్కువై స్థానికంగా నివాసం ఉండే లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పర్యావరణానికి ముప్పే

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అర్తమూరు కాలువ వద్ద వాడిపడేసిన సెలైన్‌బాటిల్స్, సూదులు, ప్లాస్టిక్ వ్యర్థాలతో తీవ్ర ఇబ్బందిగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. రామవరం నుంచి అర్తమూరు వెళ్లే దారిలో కాలువ వద్ద చెత్తాచెదారాలను ఇక్కడ డంప్‌చేస్తున్నారు. దీనిలో సెలైన్ బాటిల్స్, సూదులు, ప్లాస్టిక్, నిర్మాణ తదితర వ్యర్థాలను ఇక్కడ పోస్తున్నారు. ప్రమాదకరమైనవి వేరుచేసి పంచాయతీ కార్మికులకు ఇస్తే వాటిని ప్రత్యేకంగా ధ్వంసం చేయాలి. అలా కాకుండా వాటిని కాలువ గట్టుపై వదిలేస్తున్నారు. దీనివల్ల కుక్కలు, ఆవులు, గేదెలు వీటిని ఆహారంగా తీసుకొనేందుకు ప్రయత్నిస్తున్నాయి. సంపద కేంద్రానికి తీసుకెళ్లి వీటిని వేరుచేయాల్సిన బాధ్యత పంచాయతీకి ఉండగా కనీసం ఆ ప్రక్రియ లేకుండా ఊరుచివర పడేస్తున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



అర్తమూరు- రామవరం కాలువగట్టుపై వ్యర్థాలు

రహదారిపై గోతులు పూడ్చరూ...



మెర్నిపాడు వంతెన వద్ద పరిస్థితి

మండపేట గ్రామీణం: మెర్నిపాడు- వెలగతోడు రహదారి అత్యంత దారుణంగా మారింది. తారు రోడ్డుపై కంకర రాళ్లు తేలి ఉన్నాయి. దీంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో ఈ రహదారిపై రాకపోకలు చేయాలంటే ప్రజలు భయపడుతున్నారు. దీనిపై సంబంధిత ర.భ.శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. ర.భశాఖ డీఈ సూర్యనారాయణను వివరణ కోరగా సాధారణ మెయింటినెన్స్ నిధులతో మరమ్మతులు చేపడతామన్నారు.



ఆదివారపుపేటలో.. | ద్వారపూడిలో | మండపేటలో.. | గాయత్రీ దేవిగా కన్యకాపరమేశ్వరి | రామచంద్రపురం కొత్తూరు రోడ్డులో.. | జ్ఞాన సరస్వతి అమ్మవారు | శీలంవారి సావరం రోడ్డులో | వెదురుపాకలో.. | పామర్రులో..

గాయత్రీ దేవీ.. కరుణించు తల్లీ

రామచంద్రపురం, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రామచంద్రపురం పట్టణంలో అమ్మవార్ల ఆలయాల్లో గాయత్రీ మాత అలంకరణలు ఆకట్టుకున్నాయి. పట్టణంలోని కొత్తూరు రోడ్డు, పార్కువద్ద, జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని గాయత్రీమాతగా అలంకరించారు.

- **ద్వారపూడి.** మండపేట మండలం ద్వారపూడి గ్రామంలో పాత వస్త్ర దుకాణ సముదాయం వద్ద ప్రసిద్ధి చెందిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం గాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు.
- **ద్రాక్షారామ:** ద్రాక్షారామ శ్రీమాణిక్యాంబ అమ్మవారి ఆలయంలో ఉదయం 4.30గంటలకు సుప్రభాతసేవ, మేలుకొలుపు, ప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, తీర్థపుబిందె, బాలభోగం జరిగాయి. అర్చనలు, కుంకుమపూజలు జరిగాయి. అమ్మవారిని గాయత్రీదేవి రూపంలో అలంకరించారు. ఆదివారపుపేట శ్రీ బాలయోగి ఆశ్రమంలో దుర్గాదేవిని గాయత్రి దేవి రూపంలో అలంకరించారు.
- **మండపేట గ్రామీణం:** శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులను అనుగ్రహించారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో నవవర్నార్చన, బాలా త్రిపురసుందరి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు జరిగాయి. కలవపువ్వు సెంటర్‌లోని కనకదుర్గమ్మవారికి విశేష అలంకరణ చేశారు. తాపేశ్వరంలో కనకదుర్గమ్మవారికి మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు.
- **రాయవరం:** వెదురుపాక విజయదుర్గాపీఠంలో వేదమాత గాయత్రీదేవిగా విజయదుర్గాదేవి శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. గాయత్రి అష్టోత్తరాలతో మహిళలు అమ్మవారికి సామూహికంగా శ్రీచక్రార్చనలు నిర్వహించారు. విజయదుర్గాదేవిని ఇంటర్మీడియట్ ఆర్ఐవో నరసింహారావు దంపతులు దర్శించుకున్నారు. మండలంలో వి.సావరం, రాయవరం, లొల్ల, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు శైవక్షేత్రాల్లోనూ, చలువ పందిళ్లలో అమ్మవార్ల విగ్రహాల వద్ద భక్తులు కుంకుమార్చనలు నిర్వహించారు.
- **పామర్రు:** పామర్రులో పార్వతీదేవిని శుక్రవారం చేసిన అలంకరణ అందరినీ ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో మహిళలు దేవాలయంలో సామూహికంగా లలితాసహస్రనామ పారాయణ చేశారు. ప్రముఖ శైవ క్షేత్రం కోటిపల్లిలో రాజరాజేశ్వరీదేవిని అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నారు.

ప్రజాధనం 'రాళ్ల'పాలు



వాకతిప్పలో నిరుపయోగంగా సర్వే రాళ్లు

అంగర: రైతుల పొలాలను సమగ్రంగా సర్వే చేసి, సరిహద్దులు గుర్తించేందుకు వేసే రాళ్లపై జగనన్న పేరు. ..ఆ సర్వే అనంతరం ఇచ్చే పట్టాదారు పాసుపుస్తకంపై జగనన్న చిత్రం... ఇలా మాజీ ముఖ్యమంత్రి తన పేరును శిలాశాసనంగా మార్చుకుని రూ.లక్షల ప్రజాధనం రాళ్లపాలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే ఎన్నికల కోడ్ కారణంగా భూసర్వే పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆ సర్వే రాళ్లు గ్రామాల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. సర్వే పూర్తికాకముందే ప్రభుత్వ నిధులతో సిద్ధం చేసిన సర్వేరాళ్లను గ్రామాలకు సరఫరా చేశారు. ఇప్పుడు అవన్నీ గ్రామాల్లో చెల్లాచెదురుగా పడిఉన్నాయి. కొంతమంది వాటిని తమ అవసరాల కోసం వినియోగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయడంతో వీటి వినియోగంపై ప్రస్తుతం సందిగ్ధత నెలకొంది.

బేతాళపూజతో దసరా ఉత్సవాలకు శ్రీకారం

ద్రాక్షారామ: ద్రాక్షారామలో ఏనుగుల సంబరంగా పిలిచే దసరా ఉత్సవాలకు శుక్రవారం రాత్రి బేతాళపూజ చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ద్రాక్షారామలో కర్రివారి వీధి, నున్నవారి వీధి, బుర్రావీధుల్లో మూడుచోట్ల దసరా పండగకు ఏనుగుల సంబరాన్ని నిర్వహిస్తారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాక ఆయాచోట్ల బేతాళుడిని పూజచేయడం ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా కర్రివారివీధి, నున్నవారి వీధికి చెందిన యువత తీన్‌మార్ వాయిద్యాలతో వచ్చి బోస్ కూడలిలో పూజ నిర్వహించారు. అనంతరం సంబరం నిర్వహించే చోటుకు తీసుకెళ్లి దసరా వరకు ఒక బాలుడు దీక్ష వహించి పూజలు నిర్వహిస్తాడు. భారీగా బాణసంచా కాల్చారు.

సువర్ణపుష్పాలతో అర్చన

ద్రాక్షారామ, న్యూస్‌టుడే : అష్టాదశ శక్తిపీఠాల్లో 12వ పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారికి శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం సువర్ణ, రజిత పుష్పాలతో అర్చన నిర్వహించారు.

వస్త్ర సంచులపై అవగాహన కల్పించండి



ఆర్పీల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

మండపేట గ్రామీణం: వస్త్ర సంచులపై అవగాహన కల్పించాలని మెప్మా రిసోర్సు పర్సన్లకు మండపేట మున్సిపల్ కమిషనర్ టి.వి రంగారావు సూచించారు. పురపాలక సమావేశ మందిరంలో సిటీ మిషన్ మేనేజరు సుజాత, మెప్మా ఆర్పీలకు తడిచెత్త, పొడిచెత్తపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఉదయాన్నే ఆర్పీలు వార్డులోకి వెళ్లి మహిళలకు తడి, పొడి చెత్త వేరు విధానంపై అవగాహన కల్పించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు, డ్రైనేజీల్లో చెత్త వేయకుండా, దోమల వల్ల డెంగీ, మలేరియా, జ్వరాలు వచ్చే అవకాశం ఉందనే తెలియజేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించాలని, బజారులో కూరగాయలు, నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడానికి వస్త్ర సంచులు వాడే విధంగా చూడాలన్నారు. వేడుకల్లో ప్లాస్టిక్ గ్లాసులు బదులు పేపర్ గ్లాసులు వినియోగానికి కృషిచేయాలన్నారు.

నాణేలు సేకరించి.. ప్రదర్శించి

అవగాహన కల్పిస్తున్న తపాలా ఉద్యోగి

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: పురాతన నాణేలు సేకరించడమే కాకుండా బహిరంగ ప్రదేశాల్లో, పాఠశాలల్లో ప్రదర్శించి అవగాహన కల్పిస్తున్నారు మండలంలోని అన్నాయిపేటకు చెందిన తపాలా ఉద్యోగి. ఉద్యోగంలో స్థిరపడినా ఇప్పటికీ పాఠశాలల్లో నాణేల ప్రదర్శనను కొనసాగిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు ద్రాక్షారామ సమీపంలోని అన్నాయిపేటకు చెందిన చల్లా ప్రశాంత్ కుమార్. ప్రస్తుతం కె.గంగవరం మండలం దంగేరులో పోస్టుమాస్టరుగా పనిచేస్తున్నారు. ఈయనకు పురాతన నాణేలు సేకరించడమంటే చిన్నతనం నుంచి ఎనలేని మక్కువ. తొమ్మిదో తరగతి చదువుతున్నప్పటి నుంచే నాణేలు సేకరించడం మొదలు పెట్టి ఇప్పటి వరకు 140 దేశాలకు చెందిన నాణేలు సేకరించారు.

అరుదైన నాణేలు అనేకం...

ప్రస్తుతం చలామణిలో ఉన్న నాణేలే కాకుండా అరుదుగా లభించే వివిధ దేశాలకు చెందినవి కూడా ఆయన సేకరించారు. వాటిలో ముఖ్యంగా 1977కు చెందిన పాకిస్థాన్‌కు చెందిన 25 పైసలు, స్వీడన్‌కు చెందిన 5ఓర్, గ్వాలియర్ స్టేట్‌కు చెందిన 1/4అణా, యూఎస్ మొదటి అధ్యక్షుడు జార్జి వాషింగ్టన్ చిత్రంతో ముద్రితమైన డాలర్, మయన్మార్ 5 పైయాస్, ఈజిప్టు 5పైస్ట్రెస్, ఈస్ట్ ఇండియా కంపెనీ 1/4 అణా, విక్టోరియా మహారాణి వెండి రూపాయి, మడగస్కర్ 5 ఫ్రాన్సెస్, ఇండీవర్ 5 సెంట్స్, యుగోస్లేవియా 5 కోట్ల నోటు, వంటి అనేక అరుదైన నాణేలు ఈయన వద్ద ఉన్నాయి. అంతే కాకుండా 1944లో ముద్రితమైన సిల్వర్ అర్ధరూపాయి, సిల్వర్ ఒక రూపాయి, ఇటీవల కాలంలో ముద్రితమైన 2, 5, 10 రూపాయల్లో వివిధ చిహ్నాలు గల కాయిన్స్ ఈయన వద్ద ఉన్నాయి.



పాఠశాలలో ఏర్పాటు నాణేల ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

అందరూ తెలుసుకోవాలని..



నేను సేకరించిన నాణేలు పది మందికి చూపిస్తే వారికి ఆయా దేశాల కరెన్సీ పట్ల అవగాహన ఉంటుందని భావించి పలు పాఠశాలల్లో నాణేలు ప్రదర్శించడం మొదలు పెట్టా. కళాశాలలో చదివే రోజుల్లో చాలా పాఠశాలల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేశా. నాణేల ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో స్ఫూర్తి తీసుకురావడానికి తనవంతు ప్రయత్నం చేస్తున్నా.

-చల్లా ప్రశాంత్ కుమార్, అన్నాయిపేట

ఇంకా జగన్ చిత్రమేనా..?



అక్టోబరు 3న ఇలా..

రామచంద్రపురం: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ జీతాలు ఇతర లావాదేవీల బిల్లులు ఏ స్టేటస్‌లో ఉన్నవి బిల్ నెం. నమోదు చేసుకుని ప్రతి నెలా ప్రతి సారి తెలుసుకుంటూనే ఉంటారు... దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగో నెలలోకి ప్రవేశించినా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం మాత్రం సీఎఫ్‌ఎంఎస్ స్టేటస్ సైట్ నుంచి తొలగించలేదని పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు. విశ్రాంత ఉద్యోగులు సైతం ఇంకా సీఎఫ్‌ఎంఎస్ వెబ్‌సైట్‌లో జగన్ ఫొటో ఇంకా ఉండేంటని విస్మయం చెందారు. సంబంధిత సీఎఫ్‌ఎంఎస్ రాష్ట్ర అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయా ఉద్యోగులు కోరుతున్నారు.